క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కామేపల్లి: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి నెల్లూరి చందన అన్నారు. సోమవారం ముచ్చర్ల షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహంలో పీహెచ్‌సీ ఆధ్వర్యాన 70 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి జె.వేణు, వైద్యురాలు సౌజన్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఏఎన్ఎం మీనా తదితరులు పాల్గొన్నారు.

పునరావస కేంద్రాల పరిశీలన

కూసుమంచి: వరద ప్రవాహానికి ముంపునకు గురై పునరావస కేంద్రాల్లో తలదాచుకున్న వారిని సోమవారం జెడ్పీ సీఈఓ దీక్షారైనా పరామర్శించారు. కూసుమంచి, పాలేరు గ్రామాల్లోని కేంద్రాలను సందర్శించిన ఆమె వారికి అందిస్తున్న భోజనం, ఇతర వసతులను పరిశీలించారు. వరద ప్రవాహం తగ్గేంత వరకు సహాయ చర్యలు అందించాలని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డికి సూచించారు.

అన్నదానానికి వితరణ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ విశాలాక్షి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రతీ సోమవారం నిర్వహించుతున్న అన్నదానానికి పలువురు భక్తులు సోమవారం విరాళాలు అందించారు. చారుగుండ్ల వెంకటేశ్వర్లు, మంగతాయి దంపతులు రూ.12 వేలు, గంగుల లింగయ్య, వరలక్ష్మి దంపతులు రూ.10 వేలు అందించినట్లు దేవాలయ కమిటీ బాధ్యులు తెలిపారు.

ఆదుకోవాలని ధర్నా..

ఖమ్మంరూరల్: మున్నేరు వరద ప్రవాహానికి నష్టపోయిన తమకు ప్రభుత్వంతక్షణమే స్పందించి ఆదుకోవాలని వరద బాధితులు సోమవారం ఉదయం కరుణగిరి వద్ద ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. దీంతో ఇటు రాపర్తినగర్ పెట్రోల్ బంక్ వరకు, అటు నాయుడుపేట క్రాస్‌రోడ్డు వరకు వాహనాలు నిలిపోయాయి. దీంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, ఇతర అధికారులు వచ్చి సాయం అందిస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నాను విరమించారు.

రెస్క్యూ టీం ఆపరేషన్ సక్సెస్


చిన్నారిని బోటులోకి తీసుకుంటున్న ఆర్ఐ

ఖమ్మంక్రైం: నగరంలోని ముంపు ప్రాంతాలకు గురైన కవిరాజ్‌నగర్, మోతీనగర్ ప్రాంతాల్లో ఏఆర్ పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ ద్వారా పలువురు ప్రాణాలతో బయటపడ్డారు. ఆర్ఐ కామరాజు ఆధ్వర్యాన వరద ఉధృతిలో చిక్కుకున్న చిన్నారితో పాటు మరో 9 మందిని బోట్ ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

ఖమ్మంఅర్బన్: భారీ వర్షం వరదలతో మరిపెడ వద్ద కారు కొట్టుకుపోయి అకాల మరణం చెందిన వ్యవసాయ యువ శాస్త్రవేత్త కుమారి అశ్విని కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గేషియా ప్రకటించాలని గిరిజన సంఘం నాయకులు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆమె అంచెలంచెలుగా ఎదుగున్న తరుణంలో తండ్రి నునావత్ మోతీలాల్‌తో సహా వరదల్లో కొట్టుకుపోయి చనిపోవడం బాధకరమని, ఎక్స్‌గ్రేషియాతో పాటు వారి కుటుంబములో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ చేసిన వారిలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ రామచంద్రనాయక్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమలాల్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ బస్కి నాయక్, సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ధరావత్ రామ్మూర్తినాయక్, ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తేజావత్ శివాజీనాయక్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బానోతు తారాబాయి తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నేలకొండపల్లి: వరదలపై ప్రజలు జాగ్రత్తగా ఉండేలా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ సోమశేఖర్‌శర్మ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం పర్యటించాన మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులకు కేటాయించిన గ్రామాల్లోనే ఉండాలని, పునారావస కేంద్రాల్లోని బాధితులకు సౌకర్యాలు కల్పించాల న్నారు. దెబ్బతిన్న రహదారులు, పంట పొలాల వివరాలు సేకరించి సిద్ధంగా ఉండాలని అన్నారు. ఎంపీడీఓ ఎం.యర్రయ్య, తహసీల్దార్ ఇమ్రాన్, ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు, మండల పంచాయతీ అధికారి శివ, పంచాయతీ రాజ్ ఏఈ ప్రసాద్, ఈజీఎస్ ఏపీఓ సునీత, ఐకేపీ ఏపీఎం అశోక్ రాణి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆలస్యం మధుసూదన్‌రావు, రవి, ఈజీఎస్ ఈసీ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణమే మిగిలింది..


మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులు

- సర్వం కోల్పాయామని వరద బాధితుల ఆవేదన
- కట్టుబట్టలతో పునరావాస కేంద్రాలకు
- ప్రభుత్వమే ఆదుకోవాలని వినతి

ఖమ్మంవైద్యవిభాగం/ఖమ్మంక్రైం/ఖమ్మం స్పోర్ట్స్: సర్వం కోల్పోయాం... కట్టుబట్టలతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బయటపడ్డాం... గతంలో ఎన్నడూ లేని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో మున్నేరు వరద పోటెత్తగా.. పునరావస కేంద్రాల్లో తలదాచుకున్నామని రోధిస్తూ బాధితులు తమ గోడు 'సాక్షి'తో వెళ్లబోసుకున్నారు. త్రీటౌన్ ప్రాంతంలో మున్నేరు ముంపు బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాలను సందర్శించగా వారు తమ బాధను ఇలా తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో పడుకున్నా..



కాంపిటేటివ్ పరీక్షల కోసం ప్రిపేర్ అవుదామని నేలకొండపల్లి నుంచి వచ్చి సారథినగర్‌లో అద్దెకు తీసుకొని ఉంటున్నాను. ఒక్కసారిగా వరద రావడంతో ఏం చేయాలో తెలియక ఖమ్మం రైల్వేస్టేషన్‌లో పడుకున్నా. ఉమెన్స్ కళాశాల పునరావస కేంద్రంలో భోజనాలు పెడుతుంటే తినటానికి వచ్చా.

– నవీన్ కొడాలి, సారథినగర్

సర్వం కోల్పోయాం..



వరద నీటికి సర్వం కోల్పోయి పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్నాం. భోజన సదుపాయం మాత్రం బాగానే ఉంది. కానీ తర్వాత ఎలా బతకాలో ఏమో. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలి. తగిన విధంగా ఉపాధి కల్పించాలి.

– ఎడ్లపల్లి నాంచారయ్య, బొక్కలగడ్డ

రెప్పపాటులో వరద..



కళ్లు మూసి తెరిచేలోగా మా ఇంటిని మున్నేరు వరద ముంచెత్తింది. దిక్కుతోచని స్థితిలో నిండు బాలింత అయిన నేను 7వ రోజు పసికందుతో మెయిన్ రోడ్ మీదకు పరుగెత్తుకొని వచ్చి వానలో పునరావస కేంద్రానికి చేరుకున్నాం. ఇక్కడ వసతులు బాగానే ఉన్నాయి.

– వాకాద గోపిక, బొక్కలగడ్డ

వరద తెచ్చిన బురద..

గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురిసి సోమవారం తెరిపినివ్వడంతో మున్నేరు, ఆకేరు, పాలేరు రిజర్వాయర్ వరద ప్రభావిత ప్రాంతాల వారికి కొంత ఉపశమనం లభించనట్లయింది. అయితే ఇళ్లు, దుకాణాలు తదితర వాటిల్లో చేరిన బురదను తొలగించేందుకు, తడిసిన బట్టలు, సామగ్రిని ఆరబెట్టుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. కొందరు చేపల వేటలో నిమగ్నమయ్యారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంలోని పద్మావతినగర్‌లో కొట్టుకుపోయిన ఆటోను బయటకు లాగుతున్న దృశ్యం


కూసుమంచి: వరద ప్రవాహానికి దెబ్బతిన్న పెట్రోల్ బంక్


నేలకొండపల్లి: సుర్దేపల్లిలో ఇంట్లోని బురద కడుగుతున్న బాధితులు

మేము సైతం...

మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాలైన బొక్కలగడ్డ, మోతీనగర్, పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, పెద్దమ్మతల్లి గుడి తదితర ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, పలు రాజకీయ పార్టీల ఆధ్వర్యాన నిత్యావసరాలు, ఆహార ప్యాకెట్లు, దుస్తులు వంటివి పంపిణీ చేసి సోమవారం తమ ఔదర్యాన్ని చాటుకున్నారు.


ఖమ్మంవన్‌టౌన్: ఆహార ప్యాకెట్లను అందిస్తున్న డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, మేయర్ నీరజ

- ఖమ్మంవన్‌టౌన్: జిల్లా ఫారెస్ట్ అధికారులు 200 భోజన ప్యాకెట్లను బొక్కలగడ్డ ప్రాంతంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి, ఐఎఫ్ఎస్ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, మేయర్ పునుకొల్లు నీరజ, ఇతర ఫారెస్ట్ డివిజినల్ అధికారులు పాల్గొన్నారు.
- ఖమ్మంఅర్బన్: బీజేపీ అర్బన్ టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు ఆధ్వర్యాన వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, మోతీనగర్ వరద బాధితులకు సుమారు 500 మందికి భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గల్లా సత్యనారాయణ, అల్లిక అంజయ్య, అనిత, నీలిమ, ఫణికుమారి పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో భోజనం, దుస్తులు..

సీపీఎం ఖానాపురం హవేలి పార్టీ కార్యాలయంలో వరదయ్యనగర్ వరద బాధితులకు సీపీఎం సానుభూతిపరులు కాటేపల్లె క్రాంతికుమార్ టిఫిన్, మధ్యాన భోజనం డాక్టర్ ప్రశాంతి, ఐద్వానాయకులు దుస్తులు వితరణగా అందించారు. నున్నా నాగేశ్వరరావు, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

- ఖమ్మంసహకారనగర్: నగరంలోని శబరి ఫంక్షన్ హాల్, ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాలోని రామ్‌లీలా ఫంక్షన్‌హాల్ లో పునరావసం పొందుతున్న వెయ్యి మందికి ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు ఆధ్వర్యాన ఆ సంఘ బాధ్యులు భోజన ఏర్పాట్లు చేశారు. డివిజన్ కార్పొరేటర్ మారగాని వెంకటేశ్వర్లు, ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదగిరి, మల్సూర్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని బొక్కలగడ్డ, నయాబజార్ బాధితులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన భోజనాలను అందించారు. బ్యాంక్ రీజినల్ మేనేజర్ జి.లింగస్వామి, ఇతర బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.
- ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ నేత తాంద్ర వినోదరావు ఆధ్వర్యాన బొక్కలగడ్డ, మోతీనగర్, మంచికంటినగర్, జూబ్లీపుర తదితర ప్రాంతాలలో అన్నదానం నిర్వహించారు. వీరెల్లి రాజేష్‌గుప్తా, నకిరికంటి వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ రాష్ట్ర బృందం ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు అందించారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, రాజమౌళి గౌడ్, గల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- ఖమ్మంమయూరిసెంటర్: పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యాన పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ నేతలు బాధిత కుటుంబ సభ్యులకు నిత్యావసరాలు అందజేశారు. పగడాల నాగరాజు, కార్పొరేటర్ రుద్రాగని శ్రీదేవి, ముక్కాల కమల, నాయకులు పాల్గొన్నారు.

జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యాన..

47వ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యాన అన్నదానం చేశారు. ఎండీ ఇలియాస్, జైనుల్‌పాషా, అబ్దుల్ మల్లిక్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఆయన సేవలను కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్


నేలకొండపల్లి: మోటాపురంలో నివాళులర్పిస్తున్న నాయకులు


ఖమ్మంమయూరిసెంటర్: ముస్తఫానగర్‌లో పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న నాయకులు


కామేపల్లి: ముచ్చర్లలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, అభిమానులు

వరద ప్రభావిత ప్రాంతాలకు అధికారుల నియామకం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మున్నేరు పరీవాహక వరద ప్రభావిత ప్రాంతాల(డివిజన్లు)కు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు 12 మంది అధికారులను నియమిస్తూ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అధికారులు వరద సహాయక చర్యలను చేపట్టాల్సి ఉంటుంది. ఇందులో 16వ డివిజన్ ధంసలాపురం కొత్తూరుకు డీఐఈఓ కె.రవిబాబు(98498 97908), 17వ డివిజన్ శ్రీనివాసనగర్‌కు ఈడీఎస్సీ కార్పొరేషన్, ఈఓ కె.నవీన్‌బాబు(80748 21137), 28వ డివిజన్ ప్రకాశ్‌నగర్‌కు సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ కె. చంద్రశేఖర్ (98495 57187) నియమించారు. అంతేకాక 29వ డివిజన్ రాజేంద్రనగర్‌కు డీటీడీఓ ఎన్. విజయలక్ష్మి(94903 49183), 30వ డివిజన్ సుందరయ్యనగర్ పంపింగ్‌వెల్ రోడ్‌కు ఏసీ లేబర్ అధికారి పి.కృష్ణవేణి(94925 55260), 34వ డివిజన్ రంగనాయకుల గుట్ట, గ్యాస్ గోదాంనకు ఏఎల్ఓ వెంగమ్మ(94925 55263), 35వ డివిజన్ మోతీనగర్‌కు ఉపాధి కల్పన అధికారి ఎస్.మాధవి(79935 68816), 46వ డివిజన్ ట్రంక్‌రోడ్, కలెక్టర్ బంగ్లాకు జేడీఏహెచ్ బి. వేణుమనోహర్(99899 97339) నియమితులయ్యారు. అలాగే 47వ డివిజన్ వెంకటేశ్వరనగర్, నయాబజార్, బొక్కలగడ్డలకు ఇండస్ట్రీస్ డీఎం ఎ.అజయ్‌కుమార్(96666 46223), 48వ డివిజన్ గణేష్‌నగర్, పద్మావతినగర్, సారథినగర్, ఎఫ్‌సీఐ గోదాం, దానవాయిగూడెం పార్క్‌లకు ఏడీఎస్ అండ్ ఎల్ఆర్ డి.శ్రీనివాసులు(98484 12537), 59వ డివిజన్ దానవాయిగూడెంకు డీసీఓ జి.గంగాధర్(98661 48930), 60వ డివిజన్ రామన్నపేటకు డీపీఎం, డీఆర్‌డీఏ శ్రీనివాసరెడ్డి (80085 00639) నియమించబడ్డారు.

పారిశుద్ధ్య పనులకు..

ఖమ్మంమయూరిసెంటర్: వర్షం, వరదలతో నగరంలోని పలు డివిజన్లు నీటమునిగాయి. ప్రస్తుతం నీరు తగ్గడంతో బురద, చెత్త చెదారం పేరుకుపోయింది. వీటిని శుభ్రం చేయించేందుకు కేఎంసీ ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టనుంది. పలు డివిజన్ల నుంచి పారిశుద్ధ్య సిబ్బందిని ఆయా ప్రాంతాల్లో పనులు నిర్వహించేందుకు కేటాయించారు. కవిరాజ్‌నగర్‌కు ఇన్‌చార్జ్‌గా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లును నియమించారు. అదేవిధంగా ధంసలాపురం, కొత్తూరుకు ఎస్సై ఎస్.ఎల్లస్వామి, శ్రీనివాసనగర్‌కు ఎస్సై జే.భీమయ్య, ప్రకాష్‌నగర్‌కు ఎస్సై కె.మల్లయ్య, రాజేంద్రనగర్, సుందరయ్యనగర్‌లకు ఇన్‌చార్జ్ ఎస్సై డి.రమేష్, పంపింగ్‌వెల్ రోడ్డు, రంగనాయకుల గుట్టలకు టీపీఓ టి.విజయ్‌కుమార్, గ్యాస్‌గోడౌన్ ఏరియాకు టీపీఎస్ సీహెచ్.నరేష్‌కుమార్, మోతీనగర్‌కు పి.సంపత్‌కుమార్, ట్రంక్‌రోడ్, డిమార్ట్, గొల్లబజార్, కలెక్టర్ బంగ్లోస్ ఏరియాకు ఎస్ఎస్ సాంబయ్య, వెంకటేశ్వరనగర్, నయాబజార్ స్కూల్ వెనుక, బొక్కలగడ్డకు ఎస్ఎస్.సాంబయ్య, గణేష్‌నగర్, మేకల నారాయణనగర్, పద్మావతినగర్, సారథినగర్, ఎఫ్‌సీఐ గోడౌన్, దానవాయిగూడెం పార్క్ ఏరియాలకు ఎస్సై జి.శ్రీను, దానవాయిగూడెంకు ఎం.బంగారి, రామన్నపేటకు ఇన్‌చార్జ్‌గా ఎస్‌జే ఎస్.లావణ్యలను నియమించారు.

'ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం'

ఖమ్మంమయూరిసెంటర్: వరదల నుంచి ప్రజలను కాపాడడంలో జిల్లాలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. సోమవారం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదలో పూర్తిగా మునిగి దెబ్బతిన్న గృహాలకు రూ.3లక్షలు, పాక్షికంగా దెబ్బతిన్న వాటికి రూ.లక్ష , చనిపోయిన వారికి రూ.20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.శ్రీకాంత్, వై.విక్రం పాల్గొన్నారు.

ముంచిన రాకాసి అలలు..

- రాకాసితండాకు ఆకేరు వరద పోటు
- కొట్టుకుపోయిన గృహాలు, వస్తువులు
- ఇళ్లల్లో రాళ్ల గుట్టలు, ఇసుక మేటలు
- ఓ సారి గ్రామం కొట్టుకుపోయి వేరే ప్రాంతానికి వెళ్లినా తప్పని కష్టాలు


పూర్తిగా ధ్వంసమైన రాకాసితండా


సర్వం కోల్పోయి విలపిస్తున్న ఓ మహిళ

తిరుమలాయపాలెం: నిద్రమత్తులో ఉన్న మండలంలోని రాకాసితండాను ఆకేరు వరద రాకాసి అలల రూపంలో చుట్టుముట్టడంతో ఆ గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే గ్రామానికి ఇరువైపులా వరద ప్రవాహం రావడంతో చెట్టుకొకరు.. పుట్టకొకరు చేరి ప్రాణాలు రక్షించుకోగా మరికొందరు డాబాలపైకి చేరారు. వరద ఉధృతి పెరగడంతో తమను కాపాడాలంటూ ఆర్తనాదాలు చేశారు. మంత్రికి ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో కలెక్టర్ ముజిమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ వరద ప్రవాహాల అటంకాల నడుమ ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని రప్పించి 47 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

కొట్టుకుపోయిన ఆరు ఇళ్లు..

వరద ప్రవాహం తగ్గడంతో సోమవారం గ్రామానికి చెందిన గ్రామస్తులు వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన ఇళ్లను చూసి గుండెలవిసేలా రోదించారు. ఇళ్లు, ట్రాక్టర్లు, వస్తువులు, బంగారం, నగదు, పంట చేలు పూర్తిగా నాశనమయ్యాయి. మేకలు, పశువులు మృత్యువాత పడ్డాయి. పంట పొలాలు ఇసుక మేటలు, రాళ్ల రప్పలతో దర్శనమిస్తున్నాయి.

అంచనాలు, సహాయక చర్యలు..

ఆకేరు వరద ప్రవాహానికి 40 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 150 విద్యుత్ స్తంభాలు దెబ్బతిని సుమారు రూ.50లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు విద్యుత్‌శాఖ ఏఈ రవికుమార్ తెలిపారు. అంతేకాకా తండాలో సర్వం కోల్పోయి తీవ్రశోకంలో ఉన్న గ్రామస్తులను తహసీల్దార్ పి.వి రామకృష్ణ, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఐకేపీ, ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యాన ప్రజలకు ఆహారం, తాగునీరు అందించడంతో పాటు నష్టాన్ని అంచనా వేశారు. రాకాసితండాతో పాటు హైదర్‌సాయిపేట, అజ్మీరతండా, బీసురాజుపల్లితండా, రమణాతండా ఆకేరు పరిసర ప్రాంతాలతో పాటు బీరోలు, బంధంపల్లి గ్రామాల్లో మొత్తం 1,710 ఎకరాలలో వరి, 1,470 ఎకరాలలో పత్తి, 505 ఎకరాలలో మిర్చి పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు.

1984లో ఓ సారి ఇలా..

ఆకేరు సమీపంలో ఉన్న రాకాసితండాకు 1984లో వచ్చిన భారీ వరదలతో తండా మొత్తం మునిగిపోయి తీవ్ర నష్టం వాటిల్లడంతో ఎత్తయిన ప్రాంతంలో కాలనీ కట్టుకుని జీవనం సాగిస్తున్నారు. తండాలో 53 కుటుంబాలకు చెందిన 220 మంది జీవనం సాగిస్తుండగా.. ఉన్న 48 ఇళ్లల్లో 6 ఇళ్లు పూర్తిగా కొట్టుకుపోయి మిగిలినవి దెబ్బతిన్నాయి. ఇంతటి వరద ప్రవాహాన్ని ఎన్నడూ చూడలేదని, ఎత్తయిన ప్రాంతంలో ఉన్న తమ గ్రామం మునగడానికి ఆకేరుపై కట్టిన సీతారామ అక్వటెక్ట్ నిర్మాణమేనని తండావాసులు ఆరోపిస్తున్నారు.

ప్రాణాలు కాపాడిన గేదెతోక..


ధ్వంసమైన ఇంటి ముందు అంగన్‌వాడీ టీచర్

తండాకు చెందిన అంగన్‌వాడీ టీచర్ బానోత్ జ్యోతి తన ఇంటి చుట్టూ వరద పోటెత్తడంతో ఆమె భర్త రవి పెద్దకొడుకుని తీసుకుని బిల్డింగ్ ఎక్కాడు. జ్యోతి తన చిన్న కుమారుడిని తీసుకుని గేదె తోక సాయంతో వరద ప్రవాహంలో సాహసం చేసి గుట్టలు ఎక్కి ప్రాణాలతో బయటపడింది. ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు సర్వం కోల్పోయింది.

అజ్మీరాతండాలో పునరావాస కేంద్రం..


పునరావాస కేంద్రానికి తరలిస్తున్న అధికారులు

రాకాసితండా వాసులకు అధికారులు అజ్మీరా తండా పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి ప్రత్యేక వాహనాల ద్వారా తరలించారు. కాగా, వీరికి డోర్నకల్ మండలం చిలక్కోయలపాడు గ్రామానికి చెందిన యూత్ సభ్యులు రెండు రోజుల పాటు భోజన ఏర్పాట్లు చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. వరద తగ్గాక మరలా వారిని రాకాసితండాకు యూత్ సభ్యులు చేర్చగా.. వరద బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇల్లు మొత్తం కొట్టుకుపోయింది..



గ్రామాన్ని వరద చుట్టుముట్టడంతో కట్టుబట్టలతో ఆ వరద నీటిలోంచి బయట పడ్డాం. ఇంటి స్లాబు దూరంలో పడిపోగా.. గోడలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అన్ని కోల్పోయిన మా కుటుంబాన్ని ఎవరు ఆదుకుంటారు.

– జర్పుల పద్మ, గ్రామస్తురాలు

పెళ్లి ఆనందం లేదు..



వరదకు ఒక రోజు ముందు మా అబ్బాయి వివాహ రిసెప్షన్ జరిగింది. ఒక్కసారిగా వరద రావడంతో బంధువులతో సహా గుట్టల వైపు వెళ్లాం. నూతన వధూవరులు డాబాపైనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఇంట్లో సంతోషం లేకుండా పోయింది.

– బానోత్ అనసూర్య

కుచించుకుపోతున్న వాగులు, నాలాలు..


వరదయ్యనగర్‌లో నీటమునిగిన నివాసాలు


వైరా రోడ్డులో ఇరుకు వంతెన ద్వారా ముందుకు సాగుతున్న వాగు నీరు


చైతన్యనగర్‌లోని రహదారిని ట్యాంకర్ల ద్వారా శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ మాధురినారాయణరావు

ఖమ్మంఅర్బన్: గతంలో ఎన్నడూ లేని విధంగా మున్నేరు వరద నగరంలోని 6, 10, 11 డివిజన్లలోని లోతట్టు ప్రాంతాలను నీట ముంచింది. ఖానాపురం అలుగు వాగు నుంచి వరద నీరు ప్రశాంతినగర్, చైతన్యనగర్, కవిరాజ్‌నగర్ ద్వారా లకారం చెరువుకు గతంలో వరద నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేవని, ఇప్పుడు వాగు మొత్తం ఎక్కడిక్కడే కుచించుకుపోయి కట్టడాలు చేయడం, వాగు, నాలాలు ఆక్రమణలకు గురికావడంతోనే ఇంతటి విపత్తు జరిగిందని నివాసులు మండిపడుతున్నారు. లకారం చెరువు వద్ద వాగు వరద పోవడానికి భూమిలో పైపుల వేయడం కూడా వరదకు ఒక కారణంగా చెబుతున్నారు. వాగు వరదకు తగిన విధంగా పైపుల్లో వరద నీరు పట్టకపోవడంతో పోటు వేసి ఎగువకు నీరు వచ్చి నివాసాల్లోకి చేరందిందంటున్నారు. కాగా, వరదలోనే జేసీబీల ద్వారా పైపుల వద్ద భారీ గండి పెట్టడంతో పాటు వైరా రోడ్డులో న్యూవిజన్ పాఠశాల దారి వద్ద ఉన్న డివైడర్‌ను రెండు చోట్ల తెంచడంతో వరద నీరు సాఫీగా ముందుకు సాగిందంటున్నారు. ఇప్పటికైనా ఆక్రమణలపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకున్నప్పుడే భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉంటాయని నగరవాసులు వాపోతున్నారు. ఈనేపథ్యాన సోమవారం వరద తగ్గడంతో వరద బాధితులు తమ ఇంటి సామగ్రిని శుభ్రం చేసుకునే పనిలో పడ్డారు.

మంత్రి తుమ్మల పర్యటన

వరద ప్రభావంతో నీట మునిగిన 11వ డివిజన్ కవిరాజ్‌నగర్‌లో పలు వీధుల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. నీట మునిగిన ఇళ్లు, బాధితులను పరామర్శించారు. తక్షణమే బాధితులకు సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న రహదార్లు, తాగు నీటి పథకాలను పునరుద్ధరించి మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు.


కవిరాజ్‌నగర్‌లో పర్యటిస్తున్న మంత్రి తుమ్మల